ఘనంగా హర్‌ఘర్ తిరంగా వేడుకలు


జగ్గయ్యపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట అర్బన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పట్టణంలో బుధవారం పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతపట్టి జగ్గయ్యపేట పట్టణంలోని ప్రధానవీధుల్లో తిరంగా ర్యాలీ చేసి, పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం తృణపాయంగా త్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ద్వారా వారందరినీ స్మరించుకునే అవకాశం దక్కిందన్నారు. విద్యార్థులంతా చిన్నప్పటి నుంచే జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, పట్టణ ఎస్ఐ పద్మారావు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కీసర రాంబాబు, అన్నెపాగ ప్రఫుల్లశ్రీకాంత్, కల్లూరి శ్రీవాణి పాల్గొన్నారు. హెచ్ఎం మాధవీలత ఆధ్వర్యంలో జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు, కేడీసీసీ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో జేఆర్‌సీ కళాశాల, ప్రిన్సిపాల్ తిరుపతిరావు ఆధ్వర్యంలో విశ్వభారతి కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ సుధీర్ ఆధ్వర్యంలో అమ్మాజీ కళాశాల, ప్రిన్సిపాల్ బుస్సా సురేష్ ఆధ్వర్యంలో వాగ్దేవి మహిళా కళాశాల, ప్రిన్సిపాల్ సంపత్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్కూల్, ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో నాగార్జున హైస్కూల్, పీటీ ప్రసాద్ ఆధ్వర్యంలో లిటిల్‌ఏంజిల్స్ స్కూల్, ప్రిన్సిపాల్ రాజు ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు, నారాయణ, శ్రీచైతన్య, చేగు విద్యాలయం విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయజెండాలను చేబూని ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ చేశారు. జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం దేశ పౌరులుగా మనందరి బాధ్యతని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ సాంబశివరావు, ఏపీవో వెంటేశ్వరరావు, ఏపీఎం సంతోష్, సిబ్బంది సురేష్, రాజు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు బుధవారం జాతీయ జెండాలు చేపట్టి ర్యాలీలు నిర్వహించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో నిర్వహించిన ఈ ర్యాలీల్లో ఉపాధ్యాయులతోపాటు గ్రామనాయకులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం అంటూ ఉపాధ్యాయులు, నాయకులు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని కునికెపాడు, గండేపల్లి గ్రామాల్లోని పాఠశాలల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో మున్నలూరు పాఠశాల హెచ్ఎం నంద్రు సురేష్ బాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతను చాటాలి : ఆర్డీఓ


అడవిరావులపాడులో ర్యాలీ పాల్గొన్న ఆర్డీఓ రవీంద్రరావు, ఎంపీపీ హనుమంతరావు, టీచర్లు, విద్యార్థులు

నందిగామ టౌన్: దేశ స్వాతంత్ర్య సముపార్జనలో అసువులు బాసిన మహనీయులు చూపిన జాతీయస్ఫూర్తిని చాటేలా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవిరావులపాడులో బుధవారం విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ రవీంద్రరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయులను నిత్యం స్మరించుకోవటంతోపాటు వారి గౌరవాన్ని పెంపొందించే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు, సర్పంచి సూరా వెంకట నర్సమ్మ, తహసీల్దార్ సురేష్‌బాబు, ఆర్ఐ వేణుకుమారి, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, కార్యదర్శి మస్తాన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిల్లకల్లులో ర్యాలీ చేస్తున్న మండల పరిషత్ ఉద్యోగులు


అనిగండ్లపాడులో జాతీయజెండాలు చేపట్టిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


పెనుగంచిప్రోలులో ర్యాలీలో చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


గండేపల్లి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు

క్లుప్తంగా

సీఐ వైవీఎల్ నాయుడు బాధ్యతల స్వీకారం



నందిగామ టౌన్: శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించేది లేదని నందిగామ టౌన్ సీఐ వైవిఎల్ నాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న హనీష్ బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో వైవిఎల్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా సాగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. సీఐ వైవిఎల్‌నాయుడును పోలీసు సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

రోగనిరోధక శక్తి పెంచుకోవాలి


డాక్టర్ వాణి

కొణకంచి(పెనుగంచిప్రోలు): వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో రోగ నిరోధక శక్తి పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ వైద్యాధికారి కె.వాణి సూచించారు. ఆయుర్వేద ఆసుపత్రిలో అన్నిరకాల వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే మందులు కూడా ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతిఒక్కరు యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవచ్చన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడటంతోపాటు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యాధికారి వాణి సూచించారు.

వీరులపాడు ఎంపీడీవోగా అరుంధతీదేవి

జుజ్జూరు(వీరులపాడు): వీరులపాడు ఎంపీడీవోగా అరుంధతీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పనిచేసిన శివపార్వతి రేపల్లెకు బదిలీకాగా, ఆస్థానంలో అరుంధతీదేవి బాధ్యతలు స్వీకరించారు. అరుంధతీదేవికి మండల పరిషత్‌కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రేపు అన్నా క్యాంటీన్ ప్రారంభం

నందిగామ టౌన్: రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం పునఃప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ ఫణి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రైతు బజార్ వద్దనున్న అన్నా క్యాంటీన్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మున్సిపల్ చైర్మన్ ఓర్సు లక్ష్మి పునః ప్రారంభిస్తారన్నారు. ప్రతిరోజు 300 మందికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కంచికచర్ల: స్కూటీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనగా స్కూటీ నడుపుతున్న వ్యక్తికి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పరిటాల సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన మార్త వెంకటేశ్వరరావు దొనబండ నుంచి స్వగ్రామానికి స్కూటీపై వెళ్తుండగా, జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెనుక నుంచి వస్తున్న ఓ కారు పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు రాగానే ఆయన స్కూటీని బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. స్కూటీ నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వైద్య చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీసీ పుటేజ్ ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం



జగ్గయ్యపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని రావిరాల ఇసుక రీచ్ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి ముక్త్యాల వైపు వెళ్తున్న ఇసుక లారీని పట్టుకున్నామని వివరించారు. లారీ, 14 టన్నుల ఇసుకను సీజ్ చేసి చిల్లకల్లు పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

కొణకంచిలో కొనసాగుతున్న ఆరోగ్య శిబిరం


కొణకంచిలో మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది


కొణకంచిలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు

పెనుగంచిప్రోలు: వైరల్ జ్వరాల నేపథ్యంలో పెనుగంచిప్రోలు మండలంలోని కొణకంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరం కొనసాగుతోంది. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే చేస్తున్నారు. సర్పంచ్ గోనెల దేవి ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మురుగు కాలువలు శుభ్రం చేయించటంతోపాటు బ్లీచింగ్ చల్లిస్తున్నారు. హెల్త్ సెంటర్‌లో మొత్తం 36మంది గ్రామస్తులకు పరీక్షలు చేశారు. ఇద్దరు వ్యక్తులు సాధారణ జ్వరంతో బాధపడుతున్నట్లు ఇంటింటి సర్వేలో వైద్యసిబ్బంది గుర్తించారు. ఎల్.బుజ్జి అనే మహిళ జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతుండగా, ఆమెకు ప్లేట్‌లెట్స్ తగ్గడంతో విజయవాడలో చికిత్స పొందుతుందన్నారు. అలాగే వెల్దుర్తిపాడులో పలువురు జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతూ విజయవాడతోపాటు చుట్టుపక్కల ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన తోక వెంకటేశ్వర్లు, కృష్ణ, రజని జ్వరం, నొప్పులతో విజయవాడ ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొందరికి ప్లేట్‌లెట్స్ సంఖ్య కూడా తగ్గిందని జ్వరపీడిత బాధితుల బంధువులు తెలిపారు.


విజయవాడలో చికిత్సపొందుతున్న వెల్దుర్తిపాడుకు చెందిన తోక వెంకటేశ్వర్లు

మహాత్ముడు నడిచిన నేల మక్కపేట


మక్కపేట ప్రధానసెంటర్‌లో ఉన్న గాంధీజీ కళావేదిక

వత్సవాయి : జాతిపిత మహాత్మాగాంధీ వత్సవాయి మండలంలోని మక్కపేటను అప్పట్లో సందర్శించారు. గ్రామంలో ఓ రోజు ఉండి గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించినట్లు అప్పటి తరం ప్రజలు చెబుతుంటారు.ఖద్దర్ ఉద్యమంలో భాగంగా 1929 ఏప్రిల్ 8వతేదీన మహాత్మాగాంధీ ఈ గ్రామానికి వచ్చారు. ఖమ్మం జిల్లా బోనకల్ వరకు రైలులో వచ్చిన గాంధీజీ, అక్కడ్నుంచి మక్కపేట చేరుకున్నారు. ఆయన వెంట భార్య కస్తూరిబాయితోపాటు ప్యారేలాల్ అనే వ్యక్తి కూడా వచ్చారు. వీరికి అయ్యదేవర కాళేశ్వరరావుతోపాటు జయంతిపురం రాజా వెళ్లి స్వాగతం పలికారు. గాంధీజీ, కస్తూరిబాయిని ఎద్దులబండిలో కూర్చోపెట్టుకుని మక్కపేట గ్రామానికి తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ప్రధాన సెంటర్‌లో ఉన్న చౌతరాయి వేదికపై నిల్చుని ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. ప్రజల్లో స్వాతంత్ర స్ఫూర్తిని నింపారు. గ్రామస్తులంతా కలసి ఉద్యమ విరాళంగా రూ.40 పోగుచేసి గాంధీజీకి అందించినట్లు చెబుతారు. అక్కడ నుంచి గాంధీజీ బృందం జగ్గయ్యపేట, కొణకంచి గ్రామాలకు వెళ్లారు. మహాత్ముడు ప్రసంగించిన చౌతరాయి వేదికకు గాంధీజీ కళావేదిక అని నామకరణం చేశారు. గాంధీజీ మరణానంతరం వేదికపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ


పేటలో నిరసన ర్యాలీలో పాల్గొన్న హిందూ చైతన్యవేదిక ప్రతినిధులు, బీజేపీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసిస్తూ బుధవారం జగ్గయ్యపేట పట్టణంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు మాట్లాడుతూ హిందువులంతా సంఘటితంగా ఉండాలని పిలుపు నిచ్చారు. హిందువులంతా కలిసికట్టుగా ఉండాలని, ఆయుధ పూజ చేయాలన్నారు. ధర్మ రక్షణ కోసం పాటుపడాలన్నీరు. అనేక మంది త్యాగ పురు షుల త్యాగ ఫలితమే హిందూత్వం అన్నారు. హిందూ చైతన్య వేదిక ప్రతినిధి రామాకృష్ణాచార్యులు మాట్లాడుతూ హింసకు వ్యతిరేకంగా ఉండే హిందువులు ధర్మాన్ని రక్షించుకోవాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. ఇతరులకు చిన్న ఇబ్బంది కలిగితేనే విలవిలలాడిపోయే రాజకీయ నాయకులు బంగ్లాదేశ్‌లో హిందూవులపై ఇంతటి ఘోరకృత్యాలు జరుగుతుంటే నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. ఉప ద్రష్ట వెంకటరమణ మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు అనే నినాదం హిందుత్వంలోనే ఉందని పేర్కొన్నారు. ర్యాలీలో బీజేపీ సీనియర్ నాయకులు కీసర రాంబాబు, న్యాయవాది శ్రావణ్, హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు, బీజేపీ నాయకులు మన్నె శ్రీనివాసరావు, రాజారామకృష్ణ వర్మ, ధరణికోట వెంకటరమణ, ముత్యాల శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జెండా వందనం'కు హాజరుకండి

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక చిల్లకల్లు రోడ్డులోని ఉదయభాను తోట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం తొమ్మిదిగంటలకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పాల్గొని జెండా వందనం చేస్తారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేఆర్‌ఎల్‌కు ఉదయభాను నివాళి




కేఆర్‌ఎల్‌కు నివాళులర్పిస్తున్న మాజీ విప్ ఉదయభాను, మాజీమంత్రి నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట అర్బన్: శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల రిటైర్డు అధ్యాపకులు కేఆర్‌ఎల్ నరసింహారావు బుధవారం మృతిచెందారు. చిల్లకల్లులో నరసింహారావు భౌతికకాయాన్ని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కళాశాల ఇంగ్లిష్ విభాగం హెడ్‌గా నరసింహారావు ఎనలేని సేవలందించారని ఉదయభాను కొనియాడారు.

మాజీమంత్రి నెట్టెం నివాళులు...

తన గురువు కేఆర్‌ఎల్ నరసింహారావు మృతిచెందారన్న విషయాన్ని తెలుసుకున్న మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేఆర్‌ఎల్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు కరువు : ఎస్‌ఎఫ్‌ఐ


తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నందిగామ టౌన్: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ విమర్శించారు. సంక్షేమ హాస్టల్ బాట కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం స్థానిక ఎస్సీ సాంఘిక బాలుర హాస్టల్, ఎస్టీ బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గోపీనాయక్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులు పడుతున్న సమస్యలను తెలుసుకునేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నందిగామ డివిజన్‌లో సంక్షేమ హాస్టల్ బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. హాస్టళ్లకు మెస్ బిల్లులు అందక వార్డెన్‌లు అవస్థలు పడుతున్నారన్నారు. మెస్ బిల్లులు నెలల తరబడి రాకపోవటంతో వార్డెన్‌లు సొంతఖర్చుతో హాస్టళ్లను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాడు–నేడు కార్యక్రమం ద్వారా సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేయాలని కోరారు. లేకుంటే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ సురేష్‌బాబును కలిసి ఓ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, ప్రేమకుమార్, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం సందర్శన


వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న డీపీఓ శివప్రసాద్‌యాదవ్, పక్కన సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు: జిల్లాలో వచ్చే అక్టోబర్ 2వతేదీ నాటికి చెత్త సంపద కేంద్రాలను 100 శాతం వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.శివప్రసాద్ యాదవ్ తెలిపారు. పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారితో కలిసి గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. చెత్త సంపద కేంద్రంలో తయారైన వర్మీకంపోస్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 298 గ్రామ పంచాయతీల్లో 263 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలున్నాయని, 24చోట్ల ఇవి పనిచేయటం లేదన్నారు. మూడు ఫేజుల్లో అన్ని కేంద్రాలు పనిచేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లాలో పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద పొందే విధానంలో ముందంజలో ఉందన్నారు. ఇందుకు కృషిచేసిన సర్పంచ్ పద్మకుమారి అభినందనీయులన్నారు. తడి చెత్త ప్రతిరోజు సేకరిస్తామని, పొడి చెత్త ఇళ్ల వద్ద నుంచి వారానికి ఒకసారి సేకరిస్తామని వివరించారు. ఈ విషయంపై మహిళలకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ ఎంపీడీవోగా శ్రీనివాసరావు

నందిగామటౌన్: నందిగామ ఎంపీడీవోగా పంగులూరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విశ్వనాథ్ బదిలీకాగా, ఆస్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. నూతన ఎంపీడీవోకు ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, ఏవో రాఘవ శర్మ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.